క్లుప్తంగా

పూడికల తొలగింపు



పూడికలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో కాలువల్లో పూడికపోయిన వ్యర్థాల తొలగింపు పనులు బుధవారం చేపట్టారు. గెడ్డలు,కాలువల్లో సకాలంలో పూడికలు తొలగించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు రోడ్లపై ప్రవహించింది. సమస్యను గుర్తించిన వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య వార్డు శానిటరీ అధికారులతో మాట్లాడి ములగాడ గ్రామంలోని గెడ్డతో పాటు వీధి కాలువల్లో వ్యర్థాలు తొలగించాలని సూచించారు. బుధవారం ఉదయం శానిటరీ సిబ్బంది గ్రామంలో కాలువల్లో పూడికలు తొలగించారు. పనులను గులిగిందల కృష్ణ దగ్గరుండి పర్యవేక్షించారు.

వేతనాలు చెల్లించేలా చూడండి

తాటిచెట్లపాలెం: దువ్వాడలోని సినర్జీస్ కాస్టింట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి చెల్లించడం లేదని ఆ కంపెనీ ఉద్యోగుల సంఘం నాయకులు వాపోయారు. ఈ మేరకు వారు బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. సమస్యను పరిష్కరించే విధంగా మేనేజ్‌మెంట్‌తో మాట్లాడతానని, ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని కేకే రాజు తెలిపారు. కార్యక్రమంలో సినర్జీస్ కాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ దేవదాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌తో ఒప్పందాలను రద్దు చేసుకోవాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

బీచ్‌రోడ్డు: గాజాలో మారణకాండ కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌తో భారత ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని పౌర ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ మంత్రి ఈ నెల 8,9,10 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీరామ్మూర్తి, మానవ హక్కుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ సుధ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గాజాలో శాశ్వత కాల్పులు విరమణ పాటించాలని, మారణకాండకు కారకుడైన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, ఇతర అధికారులను విచారించి శిక్షించాలన్నారు. ఆకలితో ఉన్న గాజా ప్రజలకి భారత ప్రభుత్వం వెంటనే ఆహార దినుసులు, మందులు అందజేయడంతో వారు కోరిన సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు నాగభూషణం, వై. నూకరాజు, రాంబాబు, బేగం, ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



కరపత్రాలు అందిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా సీపీఎం నాయకులు షీలానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈవోఐ పేరుతో సీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, దీనికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్దతు తెలుపుతోందని పేర్కొంటూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈవోఐలను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 11న పాతగాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు ఎస్.జగన్నాథరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ పోరాటంలో పాల్గొవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.మణి, గాంధీ, మల్లిక, గీత, దేవుడమ్మ, శరత్‌చంద్ర, పార్వతి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సైరన్ మోగిందో.. కలవరమే..

పెట్రోలియం కంపెనీల్లో ప్రమాదాలు • పారిశ్రామిక ప్రాంతవాసుల్లో ఆందోళన



ఈస్ట్ పెట్రోలియం కంపెనీలో చమురు ట్యాంక్‌కు మంటలు అంటుకోవడంతో ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)



1997 లో హెచ్‌పీసీఎల్‌లో గ్యాస్ లీక్ ఘటన (ఫైల్)

మల్కాపురం: సైరన్ మోగిందంటే పారిశ్రామిక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల గుండెల్లో దడ మొదలవుతోంది. పెట్రోలియం కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలు వారికి కంటిపై కునుకును దూరం చేస్తున్నాయి. తాజాగా ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీలో పిడుగుపాటుతో చెలరేగిన అగ్నిజ్వాలలు వారిని మరింత ఆందోళనకు గురి చేశాయి. ఎప్పుడు ఏ క్షణం ప్రమాదం ముంచుకొస్తుందోనని వారంతా బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంత పరిధి మల్కాపురం వద్ద హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) విశాఖ రిఫైనరీలో పెట్రోల్, డీజిల్ తదితర పెట్రో ఉత్పత్తులను తయారు చేయడం తెలిసిందే. అయితే, రసాయనాలతో కూడిన భారీ పరిశ్రమల కారణంగా ప్రమాదాలు జరగడంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నవారు హడలిపోతున్నారు.

క్షతగాత్రులను నగరానికి తరలించాల్సిందే..

నవరత్నా హోదా కలిగిన చమురు కంపెనీలలో పని చేస్తున్న కార్మికులతో పాటు, సంస్థను అనుకుని జీవిస్తున్న ప్రజలకు ఆయా సంస్థలు అవసరమైన భద్రత చర్యలను చేపట్టాలి. సంస్థలో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే, క్షతగాత్రులను తరలించేందుకు బర్నింగ్ వార్డు (అగ్ని ప్రమాద బాధితులకు తక్షణం ప్రథమ చికిత్స అందించే వార్డు)ను సంస్థ ఆవరణలో గానీ, సంస్థను ఆనుకుని ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో గానీ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అటువంటి చర్యలు శూన్యం. ఎవరికైనా గాయాలైనా నగరానికి తరలించాల్సిన పరిస్థితి నేటికీ ఉంది.

భద్రతా చర్యలు తీసుకోవాలి

ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీలో పిడుగు పడితే, దానిని తిప్పి పంపే యంత్ర పరికరం చమురు ట్యాంక్‌పై లేదా? ఒక వేళ ఇప్పటికే అక్కడ ఆ యంత్ర పరికరం ఉంటే దాని సామర్థ్యం తగ్గిందా అని ఎన్నో ప్రశ్నలు స్థానికుల మదిలో మెదులుతున్నాయి. ఒకవేళ, భవిష్యత్తులో ఇలాంటి పిడుగులు ఆ ప్రాంతంలో పడినా ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారా అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి, పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని కోరుతున్నారు. అలాగే ప్రమాదవశాత్తు ఏమైనా జరిగినా.. ప్రమాద తీవ్రతను తగ్గించే చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

గతంలో ఘటనలివీ..



2013లో హెచ్‌పీసీఎల్‌లో చిమ్నీ కూలి చెలరేగిన మంటలు (ఫైల్)

- ✔ హెచ్‌పీసీఎల్‌లో 1997 సెప్టెంబర్ 14వ తేదీన ఘోర విస్ఫోటనం జరిగింది. సంస్థలో గ్యాస్ లీక్ కారణంగా భారీగా మంటలు వ్యాపించాయి. ఆ ప్రమాదంలో సంస్థలో పని చేస్తున్న సుమారు 68 మంది మృతి చెందారు. ఆ ఘటనను తలచుకుంటే ఇప్పటికీ పరిసర ప్రాంత వాసులు హడలిపోతారు.
- ✔ 2013 ఆగస్టు 23న ఇదే సంస్థ (హెచ్‌పీసీఎల్)లో కూలింగ్ టవర్ కూలి సుమారు 28 మంది కార్మికులు మృతి చెందారు. దీంతో పారిశ్రామిక వాసుల భయం రెట్టింపైంది. హెచ్‌పీసీఎల్‌లో ఏ చిన్న సైరన్ మోగినా వీరిలో ఒకటే కలవరం. మరలా ఏం జరిగిందో? ఎక్కడికైనా వెళ్లిపోవాలో అనే ఆందోళన.
- ✔ ఆ చేదు జ్ఞాపకాలు కాస్త మరుగుపడుతున్న సమయంలో ఈ నెల 7న మధ్యాహ్నం పిడుగు పడి చమురు ట్యాంక్‌కు మంటలు వ్యాపించడం.. నేవీ, అగ్నిమాపక సిబ్బంది నిరంతరం శ్రమించినా రెండు రోజుల పాటు వాటిని ఆర్పలేకపోవడంతో సమీప ప్రాంతాల్లో నివసిస్తున్నవారు మరింత భయపడిపోయారు. ఈ ప్రాంతంలో ఇక ఉండలేం, ఏ రాత్రి సమయంలోనైనా ఆ చమురుసంస్థల్లో ఏదైనా పెద్ద ఘటన జరిగితే ప్రాణరక్షణ కోసం ఎక్కడికి పరుగులు తీయగలం అని కలవరపడుతున్నారు. వీటి పరిష్కారానికి సంస్థలు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చాలా భయం వేసింది



2013లో హెచ్‌పీసీఎల్‌లో కూలింగ్ టవర్ కూలినప్పుడు సంస్థ నుంచి పెద్ద పెద్ద శబ్దాలు వచ్చాయి. ఆ ప్రమాదంలో కార్మికులు మృతి చెందారు. అప్పటి నుంచి ఏ చిన్న ప్రమాదం సంభవించినా భయం వేస్తుంది.అధికారులు, పాలకులు స్పందించి పరిశ్రమల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. –ఆకుల లోవరాజేశ్వరి, గుల్లలపాలెం

బితుకు బితుకు



పిడుగు పాటు వల్ల చమురు ట్యాంక్ దగ్ధమవుతుందని తెలిసి ఆందోళనకు గురయ్యాం. అది ఎక్కడ పెను ప్రమాదంగా మారుతుందో, తామంతా ఎక్కడికి పోవాలని బితుబితుకు మంటూ గడిపాం. రెండో రోజుల పాటు మంటలు అదుపులోకి రాలేదు. దేవుడి దయ వల్ల ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్ల లేదు. అందుకు పరిశ్రమలో ఏ చిన్న ప్రమాదం జరిగిందని వార్త తెలిసినా మాకు ఇప్పటికీ కలవరమే. –బంక నాగేశ్వరావు, జవహర్‌నగర్

నాడు పరుగులు తీశాం



1997లో హెచ్‌పీసీఎల్‌లో జరిగిన ఘోర విస్ఫోటన ఘటన నేటికీ మా కళ్ల ముందు కదలాడుతుంది. ఆ రోజు ఉదయం వాకింగ్‌కు అని ఇంటి నుంచి బయటకు వచ్చాను.ఒకే సారి పెద్ద శబ్దం,ఆపై వెంటనే ఆకాశాన్ని అంటే మంటలు. దీంతో ప్రాణం భయంతో ఒకటే పరుగులు. నాటి పరిస్థితిని తలచుకుంటే నేటికీభయమే. –వెంకటరావు, మల్కాపురం

దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు



దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న రవికుమార్

మల్కాపురం: దోమల వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, జాగ్రత్తలు పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చునని మల్కాపురం మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 59వ వార్డు పరిధిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మలేరియా అధికారి రవికుమార్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఇంటి ముందు,రబ్బర్ టైర్లు, పాత్రలపై నీరు నిలిచే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిపై దోమలు చేరి గుడ్లు పెడతాయని, దీని ద్వారా ఆ ప్రాంతంలో దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మట్టితవ్వి వదిలేశారు

వాహనదారులకు ఇబ్బందులు



శ్రావణ్ షిప్పింగ్ మార్గంలో పరిస్థితి



గోతులు సరిగ్గా పూడ్చని ములగాడ సేవా మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతమైన ములగాడ గ్రామం నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయంగా మారడంతో పోర్టు అధికారులు రూ. 15లక్షల వ్యయంతో మరమ్మతులు చేపడున్నారు. ఆ పనులు నత్త నడకన సాగడంతో వాహనదారుల సమస్యలు అలాగే ఉన్నాయి.దాంతో పాటు కొత్త సమస్య వాహనదారులకు ఎదురవుతోంది. విద్యుత్ విభాగ సిబ్బంది భూగర్భ కేబుల్ పంపించేందుకు రెండో రోజుల నుంచి గోతులు తవ్వుతున్నారు. ఇలా తవ్విన మట్టిని సర్వీసు రోడ్లపై నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు. దీనికి తోడు వర్షాలు పడడంతో ఆ మట్టి కరిగి సేవా మార్గంపైకి వస్తుంది. అసలే గుంతల రోడ్డుతో అవస్థలు ఎదుర్కొంటున్న వాహనదారులకు రోడ్డుపై మట్టి చేరడంతో మరిన్ని అవస్థలు వచ్చాయి.వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏయూలో ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నీ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా త్వరలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ జరగనుందని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ వెల్లడించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆయన అధ్యక్షతన బుధవారం ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్సెస్ 2025–26 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ ఈ నెల 15న ఆర్చరీ పురుషులు, మహిళల విభాగంలో యూనివర్సిటీ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 25న యోగా పురుషులు, మహిళల జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ కాలేజీ క్రీడలు మహిళలు, పురుషుల విభాగంలో జరుగుతాయని చెప్పారు. కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, కోకో, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఏయూ అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్ కాలేజ్ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య పల్లవి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్.కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాసుదేవరాజు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎల్.బి.కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం



పాదయాత్రలో పాల్గొన్న ప్రతినిధులు

డాబాగార్డెన్స్: దళితుల హక్కులు కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ పేర్కొన్నారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర బుధవారం విశాఖ చేరుకుంది. స్థానిక ఎస్సీ సంఘాల నాయకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం సరస్వతీ పార్క్ నుంచి ప్రెస్‌క్లబ్ జంక్షన్, డాబాగార్డెన్స్ మీదుగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వరకు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ సాగింది. ర్యాలీలో పాల్గొన్న చింతా మోహన్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చింది ఆర్డర్ కాదని, డైరెక్షన్ అన్నారు. దానిని అడ్డం పెట్టుకుని దళితులను విభజించడం దుర్మార్గమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా వర్గీకరణ జరగలేదన్నారు. పక్కనే ఉన్న తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ సుప్రీం కోర్టు ఆర్డరుని పక్కన పెట్టారని, కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ ప్రయోజనాల కోసం వర్గీకరణ తెచ్చారన్నారు. దళిత విభజన వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిందన్నారు. రాష్ట్ర విభజన లాగే దేశ విభజన కూడా జరిగే ప్రమాదం ఉందని, దేశ సమైక్యత, సమగ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, దాసరి చెన్నకేశవులు, డాక్టర్ రాజేంద్ర, కేబీఆర్ అంబేడ్కర్, సూర్యారావు, ప్రకాష్, శరత్‌బాబు, మంచా నాగమల్లీశ్వరి, గుంజా చింతయ్య, వెంకట్రావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందించారు.

శాశ్వత పరిష్కారమేది?

గౌరీనగర్‌లో యూజీడీ సమస్య



మ్యాన్‌హోల్‌లో బ్లాక్‌లను తొలగించేందుకు గ్యాస్ పంపిస్తున్న దృశ్యం(ఫైల్)



యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న వ్యర్థాలు (ఫైల్)

గోపాలపట్నం: యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ వాసులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో యూజీడీ పైప్‌లైన్ వేసిన నాటి నుంచి నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పటి కప్పుడు పాక్షిక చర్యలు చేపట్టి వదిలేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

యూజీడీ వేసిన మొదట్లో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు కాకుండా వర్షపునీరు మాత్రమే వచ్చేది. ఇప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి మురుగు నీరంతా వస్తుండడంతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. దుర్వాసన వస్తుందని మురుగు నీరు వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఈ నీరంతా రైల్వే ట్రాక్ వద్ద కాల్వల్లో చేరి నిలిచిపోవడంతో దోమలు, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాక్షిక చర్యలతో సరి

మ్యాన్‌హోల్ నుంచి వచ్చేనీటిని మళ్లించేందుకు గ్యాస్ పంపి అడ్డంకులు తొలగించి పాక్షిక చర్యలు తీసుకుంటున్నారు. దీని వల్ల ఏమంత ప్రయోజనం ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాలు పడినప్పుడల్లా మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు వస్తోందని వాపోతున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పైపులు మార్చాలి

గతంలో వేసిన యూజీడీ పైప్‌లు చిన్నవిగా ఉండడం వల్ల మురుగు నీటిని వేగంగా లాగడం లేదు. అడ్డంకులను తొలగించేలా చర్యలు చేపడుతున్నాం. ఇక్కడి పైప్‌లు మార్చాల్సి ఉంది. చిన్నవాటి స్థానంలో పెద్ద పైప్‌లు వేయాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. శాశ్వత పరిష్కారం చూపిస్తాం.

–సుమన్, ఏఈ వాటర్ సప్‌లై, యూజీడీ విభాగం

'హోల్డ్ ఆన్' పుస్తకావిష్కరణ



రచయిత పూజితను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం ఆత్మహత్యల నివారణకు సంబంధించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పూజిత జోస్యుల 'హోల్డ్ ఆన్' అనే శీర్షికతో రచించిన సూసైడ్ ప్రివెన్షన్ అవుట్ రీచ్ – లైఫ్ సేవర్ అనే పుస్తకాన్ని ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మహత్యలు నివారించడానికి మానసిక శాస్త్రంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం పుస్తక రచయిత పూజితను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా లిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.మురళీధరరావు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలతో సృజనాత్మకతకు పదును



పోటీలో పాల్గొన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈ నెల 3 నుంచి 10 వరకు 'టాలెంట్ ఫ్యూజన్–స్కిల్స్ ఫర్ ది ఫ్యూచర్‌లో భాగంగా విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. టాలెంట్ ఫ్యూజన్ పేరిట నిర్వహించిన పోటీల్లో డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, శారీ డ్రేపింగ్ అండ్ మేకప్, హ్యాండ్ రైటింగ్, సుడోకు, క్రాఫ్ట్, ఫొటోగ్రఫీ అండ్ నెయిల్ ఆర్ట్స్ వంటి రంగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, వారు చక్కటి నైపుణ్యం ప్రదర్శించారని తెలిపారు. పోటీలు నిర్వహించిన అన్ని రంగాలు విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధి కల్పించే రంగాలేనని, పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టేవని చెప్పారు. విద్యార్థుల్లో విద్యతో పాటు సృజనాత్మక ఆలోచనలు కలిగించి, వాటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ టీఎంఎ నివేదిత, ఇతర అధ్యాపక బృందం, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పందిరి రాట మహోత్సవాలు



దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న మహిళలు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడఅప్పన్నకాలనీలో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో, 63వ వార్డు పరిధి చింతల్లోవలో షైనింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు బుధవారం పందిరిరాట వేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో మజ్జి మాలినాయుడు, కార్పొరేటర్ గల్లా చిన్నా, కమిటీ సభ్యులు మేడిశెట్టి రాజు, మేడిశెట్టి శ్రీను, అశోక్, రాపేటి శివ, మహిళలు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు నివారించదగినవే..



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.ఎస్.రాజు

సీతంపేట: ఇటీవల పెరుగుతున్న ఆత్మహత్యలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని భారతీయ మానసిక వైద్య సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఎస్.రాజు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించరు. లక్ష మందిలో 12 నుంచి 15 మంది ప్రతి ఏటా బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇవి చాలా వరకు నివారించ దగినవే అన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగి సత్వర నివారణ చర్యలు చేపడితే చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో వైఫల్యాలు, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాలు సేవించడం, మానసిక అనారోగ్యం ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని వివరించారు. పిరికి మనస్కులు, కష్టనష్టాలు ఉన్నవారు మాత్రమే బలవన్మరణాలకు పాల్పడతారని, వాటిని నివారించే శక్తి వేరే వారికి లేదనేది పూర్తిగా అవాస్తమన్నారు. ఆత్మహత్య ప్రయత్నం చేసే వారు మానసిక దౌర్బల్యం ఉన్నవారనేది అపోహ మాత్రమేనని, శారీరక రోగాల మాదిరిగా మానసిక ఆందోళన, దిగులు వంటి పరిస్థితులను కౌన్సెలింగ్ మందుల ద్వారా నయం చేసుకోవచ్చని చెప్పారు. డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించే దిశగా ప్రజలను అప్రమత్తం చేయడమే బాధ్యతగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అగనంపూడి: పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు జరపతలపెట్టిన నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను ఏపీటీఎఫ్‌నాయకులు ఆవిష్కరించారు. స్థానిక హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ గాజువాక మండల కమిటీ నాయకులు, జిల్లా కౌన్సిలర్లు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో గాజువాక కమిటీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు చెల్లించాలని, అలాగే కూటమి హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.వారం రోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అలాగే ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. పి.అప్పారావు, ఆర్డీడీ నాయుడు, త్రిలోక్ పాల్గొన్నారు.